# ఎన్నిక

ఇంటర్వ్యూ సరిగ్గా పదకొండున్నరకి. నేను బెంగుళూర్ తొమ్మిదిన్నరకి చేరుకున్నాను. నాకోసం నన్ను ఇంటర్వ్యూకి పిలిచిన కంపెనీవాళ్లే ఓ పెద్ద హోటల్‌లో గది బుక్‌చేశారు

సరాసరి ఆ హోటల్‌కు చేరుకున్నాను ఆటోలో. నా పేరు చెప్పగానే గది నంబర్ చెప్పి, గది తాళంచేతులు అందించారు నాకు హోటల్‌బాయ్ నా సూట్‌కేస్ తీసుకువస్తే టిప్ దొరకచ్చని ఆశపడ్డాడు. కాని చిన్న బ్రీఫ్‌కేస్ మాత్రమే వుంది నా దగ్గర. ఒక్కరోజే నేను బెంగుళూర్‌లో వుండేది. మద్రాస్‌నుంచి బెంగుళూరుకి నిజానికి అదికూడా అవసరంలేదు. కాని తెచ్చాను

గదిలో బ్రీఫ్‌కేస్ తెరిచి, టవల్ తీసి ముందర మొహం కడుక్కొన్నాను. ఆ గదిలోని డ్రస్సింగ్ టేబిల్‌కున్న డ్రాయర్ తెరిచాను. నా కాగితాలు పెడ్దామని.

ఎదురుగా ఆ డ్రాయర్‌లో నా గుండె ఝల్లుమనేలా వుంది రూపాయలకట్ట ఆ కట్టలో ఉన్న ఒక్క రూపాయ నోట్లే- పాతవి, కొత్తవి, నలిగినవి, నలగనివి, అన్నిరకాల రూపాయి నోట్లున్నాయి. లెక్కపెట్టాను. వంద రూపాయలు సరిగ్గా.

బహుశా ఆ గది ఖాళీచేసినవాళ్ళు దాన్ని అక్కడ దాచి, ఖాళీచేసేటప్పుడు తీసుకోవడం మర్చిపోయి వుంటారు. జేబులో వేసుకుని, వెంటనే ఇంటర్వ్యూకి హాజరుకావడానికి బయలుదేరాను. దారిలో ఆ కట్ట ఓ షాపులో ఇచ్చి, వంద రూపాయలనోటు తీసుకున్నాను. ఆ హోటల్ వాళ్ళకి డబ్బు మర్చిపోయిన సంగతి వాళ్ళు వచ్చికానీ, ఫోన్‌చేసికానీ చెప్పినా, నన్ను వెదికితే అది దొరకదిక.

ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకి సమాధానాలు చెప్పాను. మద్రాస్‌లో నేను పనిచేసే కంపెనీలో నేను నిర్వహించే బాధ్యతలకన్నా ఇక్కడ ఇంకా ఎక్కువ నిర్వహించాలి. అందుకే జీతం వెయ్యి కాక, పదిహేనువందలు ఇవ్వడానికి సిద్ధమయ్యారు వాళ్ళు ఎపాయింట్‌మెంటు ఆర్డర్ నాలుగయిదు రోజుల్లో పంపుతామని చెప్పారు,

హోటల్ గదికి తిరిగి వచ్చాను.

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఎవరూ ఆ డబ్బు గురించి అడగలేదు వెంటనే ఖాళీచేసేశాను. అనవసరంగా కష్టం కోసం ఎదురుచూస్తూ కూర్చోడం ఇష్టంలేక. వెంటనే మద్రాస్‌కి వెళ్ళే బస్ ఎక్కాను, ఆ రాత్రి ఉండకుండానే

నాలుగోరోజు నన్ను ఇంటర్వ్యూ చేసిన కంపెనీనుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రంగా కవరు విప్పాను. అపాయింట్‌మెంట్ ఆర్డరు కాదది. వుద్యోగం ఇవ్వటంలేదని వ్రాసిన రిగ్రెట్ లెటర్. ఇంకా ఇలా వ్రాశారు.

“మీకు ఇద్దామనుకున్న పోస్టులో పనిచేసేవ్యక్తి మంచివాడు. లంచాలు పుచ్చుకోనివాడు. దొంగతనం చేయని వాడు ముఖ్యంగా అవినీతిపరుడై వుండ కూడదు. మీ మంచితనం నిర్ణయించడాని కోసం, మీరు బసచేసిన హోటల్ గదిలో ముందుగా వందరూపాయలుంచాం. మీరు ఆ వందని హోటల్ యాజమాన్యంవాళ్ళకి తిరిగి ఇచ్చేసి వుండాల్సింది అది న్యాయం. మీరు దాన్ని సంగ్రహించటం మీ స్వభావాన్ని ప్రదర్శిస్తోంది. దయచేసి ఆ వంద పంపవలసిందిగా కోరుతున్నాం లేదా మీరు ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీకి ఈ సంగతి తెలియచేయాల్సి వుంటుంది.”

(యువ నవంబర్ 1975 సంచిక నుంచి)

